ప్రజాశక్తి
మంగళవారం 3 అక్టోబర్ 2023
5



అల్లూరి సీతారామరాజు

ఆదివాసీ గిరిజన సంఘం పోరాట ఫలితంగా

కళాకారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఆదివాసి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రభుత్వ అధికారులు ప్రకటించడం హర్షణీయమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పి.బాలదేవ్ అన్నారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, కొర్రా మగ్గన్న లతో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీ వాయిద్యం, దింసా, కొమ్ము కోయ నృత్యం, కర్రల కోలాటం, నాటకాల ఆదివాసీ కళాకారులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ప్రతి కళాకారున్ని గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. అధికారులు సచివాలయ పరిధిలో దండోరా వేయించి ప్రతి మండల కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తు చేసుకునే కళాకారులకు ఏమైనా సందేహం ఉంటే ఆదివాసి గిరిజన సంఘం నాయకులను సంప్రదించాలని తెలిపారు.

గిరిజన యువతకు సివిల్స్ శిక్షణ

- 7వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న మొదటి దశ పరీక్ష
- 27, 28 తేదీలలో ఇంటర్వ్యూలు
- 50 మందిని ఎంపిక చేసి 9నెలల శిక్షణ

ఐటిడిఎ పిఒ అభిషేక్ వెల్లడి



ప్రజాశక్తి-పాడేరు:ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంతో గిరిజన నిరుద్యోగ యువతకు సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ వెల్లడించారు. 50 గిరిజన కుటుంబాలలో ఉన్నత ఉద్యోగ వెలుగులు నింపాలనేది ఆశయమని ఆయన చెప్పారు. సోమవారం ఆయన కార్యాల యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది మాదిరిగా సివిల్స్ శిక్షణను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈనెల 3 వ తేదీ నుండి 7 వ తేదీ సాయంత్రం 4గంటల వరకు సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. 15వ తేదీన మొదటి దశ రాత పరీక్ష నిర్వహించి 18న ఫలితాలు వెల్లడిస్తామని తెలియజేసారు. 22న రెండవ దశ పరీక్ష నిర్వహించి 2న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. రెండవ దశ పరీక్షలో నెగిటివ్ మార్కులు విధానం అమలు చేస్తామన్నారు. 24వ తేదీన ఫలితాలు వెల్లడిస్తామన్నారు. 27,28 తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మంది అభ్యర్థులను సివిల్ కోచింగ్కు ఎంపిక చేసి 9 నెలలు ఉచిత, వసతి, భోజన సదుపాయంతో శిక్షణ అందిస్తామన్నారు. ప్రముఖ సివిల్స్ కోచింగ్ సెంటర్ల నుండి ఫ్యాకల్టీలను తీసుకుని వచ్చి అంకిత భావంతో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సివిల్స్ శిక్షణకు సుమారు రూ.60 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఈ శిక్షణ అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగ పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 గ్రూప్ -1 ఉద్యోగాలకు, 500 గ్రూప్ 2 ఉద్యోగాలు నోటిఫికేషన్ జారీ చేస్తోందన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది ఎంపికయ్యే విధంగా శిక్షణ అందిస్తామన్నారు. పాడేరు, అరకు వ్యాలీ, చింతపల్లి కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలోని గిరిజన యువత డిగ్రీ పూర్తి చేసి 21 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరకు కాఫీకి ఫైన్ కప్ అవార్డు

ప్రపంచ కాఫీ పోటీలలో 12 ఏళ్ల తరువాత గిరిజన కాఫీకి అవార్డు దక్కిందని పిఒ తెలిపారు. సెప్టెంబరు 25 నుండి 29వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించిన ఫైన్ కప్ పోటీలలో ఐటిడిఏ, జిసిసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున కాఫీ పెవిలియన్ ఏర్పాటు చేసామన్నారు. ఈ పెవిలియన్లో భారత దేశం నుండి కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు, కాఫీ సాగు చేస్తున్న 10కిపైగా ఇతర దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు. పెదబయలు మండలం లక్ష్మీపురం పంచాయతీ కప్పల గ్రామానికి చెందిన కిల్లో అశ్విని ఆర్గానిక్ కాఫీ సాగు చేసి కాఫీ పోటీలలో బెస్ట్ వాష్డ్ అరబికా అవార్డు ఫైన్ కప్ అవార్డు) సొంతం చేసుకున్నారని చెప్పారు. కాఫీ రైతులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. జి. కె. వీధి, జి.మాడుగుల మండలాల్లో రూ.7.50 కోట్లతో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్స్ నెల కొల్పుతున్నామని చెప్పారు. 10/10 మార్కులు సాధించేలా పది విద్యార్థులకు శిక్షణ విద్యపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. 122 విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి 10వ తరగతిలో పదికి పది గ్రేడు మార్కులు సాధించేలా శిక్షణ అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. వచ్చే బుధవారం పరీక్ష నిర్వహిస్తామన్నారు. 50 మందిని ఎంపిక వేసి ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. పదికి పది సాధించిన విద్యార్థులకు మారిక వలసలో శిక్షణ అందిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుండి 9 వ తరగతి నుండి శిక్షణ అందిస్తామన్నారు. మారిక వలస శిక్షణ పొందిన విద్యార్థులు నీట్, ఇంజనీరింగ్, లాసెట్లో మంచి ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్ పాల్గొన్నారు.

డిగ్రీ బాలుర హాస్టళ్లలో

మెనూ సక్రమంగా అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ బాలురు వసతి గృహాలలో మెనూ అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జీవన్‌కృష్ణ, చిన్నారావు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ జయంతి సెలవు దినం కావడంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ విద్యార్థుల వసతి గహాల సమస్యలపై నిర్వహిస్తున్న సర్వే లో భాగంగా డిగ్రీ బాలుర వసతి గహంలో సందర్శించి సమస్యలపై అధ్యయనం చేశారు . ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, హాస్టళ్లలో ఆహార పదార్థాల మెనూ చార్ట్ పెట్టలేదని, మెనూ కూడా సక్రమంగా అమలు చేయని పరిస్థితిపై విద్యార్థులు తమతో మాట్లాడుతుంటే, వసతి గృహానికి ఎందుకు వచ్చారని తమతో గొడవలు పెట్టుకునేందుకు వార్డెన్ దిగుతున్నారన్నారు. మెనూ పాటించి విద్యార్థులకు పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాలలో గదులు సరిగా లేవని, మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. గదులన్నీ పెచ్చులు ఊడి హాస్టల్‌లో ఉండలేక విద్యార్థులు కొంతమంది అద్దెకు రూములు తీసుకుని ఉంటున్నారని తెలిపారు. గదులు బాగుంటే అందరు విద్యార్థులు వసతి గృహాలలోనే ఉండేవారన్నారు. తమతో మాట్లాడని వ్వకుండా విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి తగాదాలు పెట్టుకున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, సింహాద్రి, రాజు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, కళాసీలు

ఎరియర్స్ తక్షణమే చెల్లించకుంటే సమ్మె

- నోటీసులు అందజేసిన జిసిసి కళాసీలు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు జిసిసి పాయింట్లో పనిచేస్తున్న కళాసీలకు నాలుగు నెలల ఎరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని, లేకుంటే సమ్మె చేస్తామని జిసిసి గొడౌన్ ఇన్‌ఛార్జి వసంతరావుకు సిఐటియు ఆధ్వర్యాన కళాసీలు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి కూలి రేట్లు పెంచుకున్న కళాసీలు, అనేక దఫాలుగా అధికారుల చుట్టూ తిరిగి వాటి అమలు చేయించుకున్నారని తెలిపారు. అయినా జిసిసి సివిల్ సప్లై అధికారులు హమాలీలకు రావలసిన పెండింగ్ ఎరియర్స్ చెల్లించకుండా అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారుల దష్టికి అనేకమార్లు తీసుకెళ్లిన వాయిదా లేస్తూ గడుపుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చింతూరు హమాలీలకు రావాల్సిన రూ.1.77 లక్షలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎరియర్స్ చెల్లించేంతవరకు హమాలీలు పని బంద్ చేసి సమ్మెలో ఉంటారని స్పష్టం చేశారు. ఎరియర్ చెల్లించిన మరుక్షణం నుండి పనిలోకి వస్తారని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు స్వామి, నాగు, రాజు, అప్పారావు, నాగరాజు, చంద్రం, ముత్తయ్య, రమేషు, మంగరాజు, చిట్టిబాబు, రామయ్య, రాఘవయ్య, భద్రయ్య, సురేష్, రాంబాబు, సుబ్బయ్య, రాజయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



అరుకులో నిరసన చేపడుతున్న నేతలు

టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి-అరకులోయ:వైసీపీ ప్రభుత్వం ప్రజా స్వామ్యంను ఖూని చేస్తుందని రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సియ్యారి దొన్నుదొర విమర్శించారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ అరకులోయలో సోమవారం దీక్ష చేపట్టారు. పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, నాయకులు బూర్జలక్ష్మి, నాగరాజు, పి.రవీంద్ర, జగన్, చందు పాల్గొన్నారు.


పెదబయలు:మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడ్ని విడుదల చేయాలని మండల కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద టిడిపి నేతలు నిరసన దీక్ష సోమవారం చేపట్టారు. అనంతరం మాజీ మంత్రి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, వైసిపికి ప్రజలే సంకెళ్లు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్టీ సెల్ కమిషన్ సభ్యులు సెవెరీ అబ్రహం, మండల పార్టీ అధ్యక్షులు సీకారి సుకుమారి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్షులు బాబురావు, తులసిరావు, మాజీ జీసిసి ఛైర్మన్ శెట్టి లక్ష్మణుడు, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు, క్లస్టర్ ఇంచార్జి మురళి పాల్గొన్నారు

అనంతగిరి:చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు టి.బుజ్జీబాబు ఆధ్వర్యాన నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, మండల నాయకులు టి.ఆనందరావు బొర్రా సర్పంచ్ జె.అప్పారావు మాజీ సర్పంచ్ సోమ పాల్గొన్నారు.

చింతపల్లి:అంతిమ విజయం న్యాయానిదే అవుతుందని తెదేపా మాజీ మండల అధ్యక్షుడు బేర సత్యనారాయణ అన్నారు. లంబసింగి (కొర్రుబయులు) గ్రామంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్యతో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. మాజీ ఎంపిటిసి సభ్యుడు పొత్తూరు రామ్మూర్తి, మాజీ మండల ఉపాధ్యక్షుడు బోనంగి సోమలింగం పడాల్, బోనంగి పార్వతమ్మ, వెంకటరమణ, రామారావు పాల్గొన్నారు.

చింతూరు:టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు ఒక్కరోజు సత్యమేవ జయతే దీక్ష సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు చేపట్టారు. ఈ దీక్షకు జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు ఇల్ల చిన్నారెడ్డి, మల్లెల వెంకటేష్, మడివి రాజు, నాగేశ్వరరావు, కవిత, పుట్టి రమేష్ ముప్పా శ్రీను, వాళ్ల రంగారెడ్డి, ముత్యాల రామారావు, భారపాటి ప్రకాష్, ఆదినారాయణ, ధనలక్ష్మి, నాలుగు విలీన మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జీకే వీధి మండలం సీలేరులో సోమవారం రాత్రి 7 గంటల నుండి 5 నిమిషాల పాటు ప్రతి ఇంట్లో లైట్లు ఆపేసి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. టిడిపి పిలుపుకు పలువురు మద్దతుగా లైట్లు ఆపేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిద్దాం అంటూ నినాదాలు చేశారు.



నిరసన చేపడుతున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి-పెదబయలురూరల్:జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద పెదబయలు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొమ్ము కొండబాబు, కార్యదర్శులు సిహెచ్ మత్స్యరాజు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. **ముంచింగిపుట్టు:** ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు కాంతారు మోహన్, బి.శ్రీనులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే ను పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ ఆవరణ గాంధీ విగ్రహం వద్ద స్థానిక పాత్రికేయులు నిరసన చేపట్టారు. జఅనంతరం ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్ పర్సన్ సుభద్రకు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్, జి.కోటిబాబు, కె.ఈశ్వర్, కె.అనిల్, భూషణం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

వన్య ప్రాణులను కాపాడండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అడవిలో స్వేచ్ఛగా సంచరించే వన్యప్రాణులను కాపాడడం మన అందరి బాధ్యత అని ఫారెస్టు రేంజ్ అధికారి ఎం.అబ్బాయిదొర అన్నారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా అబ్బాయిదొర ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ చూపిన అహింసా సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలని, అడవిలో సంచరించే వన్యప్రాణులను ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా రక్షించుకోవాలని నినదించారు. వన్యప్రాణులను వేటాడినా, హతమార్చినా చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారి దారుణ హత్య

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలో బంగారుమెట్ట పంచాయతీ సరియాపల్లి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రవీంద్ర కథనం మేరకు... గ్రామానికి చెందిన వంతల భాస్కరరావును వివాహం చేసుకున్న మొదటి భార్యకు ఇద్దరు సంతానం. కొన్నేళ్లకు మొదటి భార్య మృతి చెందింది. దీంతో, రెండవ భార్య నీలమ్మను వివాహమాడాడు. భాస్కర్‌రావు తాపి మేస్త్రి పనులు చేస్తూ ఉదయం వెళ్లి సాయంత్రం వస్తుంటాడు. సవతితల్లి నీలమ్మ ఆ పిల్లలను వేధిస్తూ, చిత్రహింసలు పెట్టేది. సవతి తల్లి నీలమ్మ మూడేళ్ల బాలిక వంతల హర్షితను గ్రామ సమీపంలోని కాఫీ తోటకు తీసుకెళ్లింది. ఆ బాలిక మెడనుగట్టిగా నొక్కి బండరాయితో కొట్టి హత్య చేసి అక్కడ విడిచిపెట్టి గృహానికి వెళ్లిపోయింది. ఈ విషయం భాస్కరరావుకు నీలమ్మ చెప్పగా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ గ్రామస్తుల సహాయంతో కాఫీ తోటల కొండపై వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సిహెచ్‌సికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. నీలమ్మను రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ వెల్లడించారు.



నివాళి అర్పిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర, జెడ్‌పిటిసి గంగరాజు

ప్రొఫెసర్ రాధాకృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని వెచ్చంగి గ్రామంలో కీర్తిశేషులు, ప్రొపెసర్ డాక్టర్ లసాంగి రాధాకృష్ణకు ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజులు ఘనంగా నివాళి అర్పించారు. గ్రామంలో రాధాకృష్ణ పెద్ద కర్మ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ, ముంచంగిపుట్టు మండలంలోని వెచ్చంగి గ్రామంలో జన్మించిన రాధాకృష్ణ ఎన్నో కష్టాలు పడి అత్యున్నతమైన యూనివర్సిటీలో ప్రొపెసర్‌గా నియమితులవ్వడం గర్వ కారణమన్నారు. కృషి, పట్టుదలతో చదివి అంచెలంచెలుగా ఉన్నత విద్యావంతులుగా ఎదిగారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, సీపీఎం మండల కార్యదర్శి భీమరాజు, కిల్లో రామారావు, రాందాస్, శివ పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - అరకులోయ:మండలంలోని సుంకర మెట్ట పంచాయతీ లింబగుడ గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన భూ రీ సర్వే లో మంజూరైన పట్టాలను లబ్ధిదారులకు సోమవారం సుంకరమెట్ట సిపిఎం సర్పంచ్ జి. చిన్న బాబు పంపిణీ చేశారు. సుంకర మెట్ట పరిధిలోని లింబగుడ గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు భూమి పట్టాలు అందజేశామన్నారు. భూ రీ సర్వేలో అన్నదమ్ముల మధ్య భూ పంపకాల సమస్య ఉన్న వాటిని సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే పరిష్కారం చేయాలని చిన్నబాబు కోరారు. గ్రామకంఠం భూములు, శ్మశాన వాటికలు వంటి సమస్యలు కూడా పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆశలత, గృహ సారధి రాధ, విఆర్ఓ బూర్జ అమ్ములు, వాలంటీర్ బాబురావు, రాజు పాల్గొన్నారు.



పట్టాలు ఇస్తున్న చిన్నబాబు

అల్లూరి సాగించిన ఉద్యమాన్ని కొనసాగించాలి

ఎపి విశ్రాంత చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ వెంకటేశ్వర్లు



నూతన కార్యవర్గాన్ని సన్మానించిన దృశ్యం

ప్రజాశక్తి -అడ్డతీగల

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సాగించిన సంపూర్ణ స్వాతంత్ర్య ఉద్యమాన్ని కొనసాగించాలని ఏపీ విశ్రాంత చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరి ఏ ఆశయాల కోసమైతే పోరాడారో, అవి నేటికీ నెరవేరలేదని, అల్లూరి ఆశయ సాధనకు యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రథమ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు సోమవారం అడ్డతీగలలోని శ్రీసూర్య స్కూలులో సోమవారం జరిగాయి. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి 2 సంవత్సరాల పాటు బ్రిటిష్ వాళ్లకు పట్టుబడకుండా సాయుధ పోరాటం చేశారని, దానికి గిరిజనులే కారణమని, అల్లూరి పితూరిలో వేలాది మంది గిరిజనులు ఆహుతైపోయారని తెలిపారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ జన్మించిన 1897లోనే అల్లూరి జన్మించాడని, నేతాజీ 125 రూపే నాణాన్ని విడుదల చేశారని, అల్లూరి 125 నాణాన్ని విడుదల చేయాలని తమ సంఘం తరుపున కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని కోరుతూ లేఖలు రాశామని తెలిపారు. కాని నిర్లక్ష్యంతో పట్టించుకోలేదన్నారు. ఇటీవల ఎన్‌టి.రామారావు 100 రూపే నాణాన్ని విడుదల చేశారని, అంతకన్నా అల్లూరి తీసిపోయాడా? అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అల్లూరి చరిత్ర పట్ల నిర్లక్ష్యం చూపుతున్నాయన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు చరిత్రకు సంబంధించిన మోనోగ్రామ్ పుస్తకాన్ని పడాల వీరభద్రరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకరణ

సంఘం జాతీయ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా రాజాసాగి సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షులుగా పుచ్చల రామకృష్ణ, వేటుకూరి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా యిళ్ల శ్రీకాంత్, కార్యదర్శులుగా వెల్లాల నాగార్జున, శ్యామల వరలక్ష్మి, లక్కాకుల బాబ్జి, సివంగి నాగేశ్వరరావు, రామన శ్రీనివాసరావు, వాడపల్లి శేషాచార్యులు, హరదీపక్, కోశాధికారిగా బళ్ళా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా సిహెచ్.సుబ్బారావు, దంగేటి సత్తిబాబు, ఆడారి నాగ సత్యనారాయణ, కోన సత్యనారాయణ చేత పడాల వీరభద్రరావు ప్రమాణ స్వీకారం చేయించారు. తొలత అడ్డతీగల పోలీస్ స్టేషన్ ముందు సంఘం ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహానికి సిఐ వై.రాంబాబు, ఎస్ఐ జి.అప్పలరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మంగరాజు ఆశయాలు నెరవేరుద్దాం



మంగరాజు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఎటపాక

సిపిఐ నాయకులు కందుకూరి మంగరాజు ఆశయాలను నెరవేర్చాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి, మంగరాజు సతీమణి కందుకూరి స్వర్ణ పిలుపునిచ్చారు. మంగరాజు జయంతి సందర్భంగా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో సోమవారం ఆయన స్థూపానికి ఎంపిటిసి కంటే రాజు, సిపిఐ మండల కార్యదర్శి ఎలిషాల నాగరాజు, ముసునూరి వెంకన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ మంగరాజు పోలవరం నిర్వాసితులకు పరిహారం కోసం అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. నేడు అయన మన మధ్య లేక పోవడం బాధాకరమని, ప్రతి నిర్వాసితుడు గుండెల్లో నిలిచి పోయే నాయకుడు మంగరాజు అని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడమే ఆయన లక్ష్యమని, పరిహారం ఇచ్చేంతవరకు పోరాటం చేస్తూ మంగరాజు గారి ఆశయాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భద్రమ్మ, మాజీ ఎంపిటిసి పసుపులేటి ముత్తయ్య, సీపిఐ నాయకులు పూసా రాఘవలు, దుర్గా, చంటి, సుబ్బారావు, సత్యరాజు, గడ్డం వెంకటేష్, వెంకట రత్నం పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బాలారం గ్రామపంచాయతీ పరిధి డి.మల్లవరం గ్రామంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నియోజకవర్గ అభివృద్ధి నిధులు 5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణానికి వైసిపి సీనియర్ నాయకులు మామిడి రమణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్, వైసిపి నాయకులు రాంబాబు, అప్పారావు, లక్ష్మణరావు, రాజాబాబు, రాజేశ్వరి, గంగాయమ్మ, లక్ష్మి, నీలావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాలకు ఎల్ఇడి లైట్లు వితరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని కిర్రాబు గ్రామంలోని గ్రామదేవతలు గంగాలమ్మ, నూకాలమ్మ అమ్మవారుల ఆలయాలకు ఎంపీపీ గోము వెంకటలక్ష్మి సమకూర్చిన రెండు విద్యుత్ ఎల్ఈడి లైట్లను సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు, ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మిని గ్రామస్తులు అభినందించారు.



సిసి రోడ్డు నిర్మాన పనులను పరిశీలిస్తున్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి

సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని కిర్రాబు గ్రామంలో రెండు సిసి రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ గోము వెంకటలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయితీలో సుమారు రూ.24 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం, రూ.1.20లక్షతో తాగునీటి బోరు నిర్మాణం, రూ.3లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి వడుగుల జ్యోతి, పార్టీ జిల్లా నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు, తదితరులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి

ప్రజాశక్తి -కొయ్యూరు

సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ రాజారావు కొప్పుకొండ, మంగళపాలెం గ్రామస్తులకు సూచించారు. మండలంలోని కొప్పుకొండ, మంగళపాలెం గ్రామాల మధ్యలో ఉన్న కొండవాగుపై నిర్మించనున్న వంతెన నిర్మాణానికి సంబంధించి రెండు గ్రామాల మధ్య భూ వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సై రాజారావు ఆయా గ్రామాల్లో పర్యటించి, గ్రామస్తులతో సమావేశమయ్యారు. గొడవలు, కోట్లాటలకు పాల్పడవద్దని హితవు పలికారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, భూ సమస్యలుంటే రెవెన్యూ అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కొయ్యూరు ఎస్ఐ రాజారావు

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యానికి భద్రత

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యాన స్వచ్ఛత పనులు
- ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ అరకులోయకు ప్రణాళికలు
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణ


అరకులో స్వచ్ఛత కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఫాల్గుణ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యానికి పరిపూర్ణ భద్రత ఉంటుందని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని అరకులోయ మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభాసోమేశ్వరి ఆధ్వర్యాన స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టారు. అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ పాల్గొని, చీపురు పట్టి రోడ్లు ఊడుస్తూ స్వచ్ఛత పనుల్లో పాల్గొన్నారు.అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మ్యూజియానికి సమీపంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ తరహా కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభాసోమేశ్వరి మాట్లాడుతూ, పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న అరకులోయను ప్లాస్టిక్ రహిత స్వచ్ఛతాప్రాంతంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. బొర్రా గుహలు, చాపరాయి, దుడుమ జలపాతం, లంబసింగి, వంజంగి,కొత్తపల్లి జలపాతాలు వంటి పర్యాటక ప్రాంతాల్లోనూ, అలాగే మండల కేంద్రాలు, వారపుసంతలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. రెండు మూడు వారాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ప్రత్యేక బృందం ఏజెన్సీలో పర్యటించనుందని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేన, ఎండి గంధం చంద్రుడు, ఎంపిపి ఉషారాణి, జెడ్‌పిటిసి శెట్టి రోషిణి, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

జడ్డంగిలో స్వచ్ఛభారత్


పిచ్చిమొక్కల తొలగింపులో ఎంపిపి, జెడ్‌పిటిసిలు

రాజవొమ్మంగి: గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలం లోని జడ్డంగి సచివాలయంలో మహాత్ముని చిత్రపటానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత స్వచ్ఛభారత్‌లో పాల్గొని, సచివాలయం ఆవరణలో పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని శ్రమదానంతో తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్ల వద్ద, గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కొంగర మురళీకృష్ణ, ఎపిఒ సురేష్ పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతిని ఊరూరా, వాడవాడలా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ముఖ్య కూడళ్లలో ఘనంగా జరుపుకున్నారు. గాంధీజీ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడేరు కలెక్టరేట్, ఐటిడిఎ కార్యాలయాలు, రంపచోడవరం ఐటిడిఎల్లో గాంధీజీతోపాటు లాల్ బహుదూర్‌శాస్త్రికి అంజలి ఘటించారు.
- (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో మెయిన్‌రోడ్‌లోని మహాత్ముని విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు మహాత్ముని ఆశయ సాధనకు ఐక్యంగా కృషి జరపాలని పిలుపునిచ్చారు వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. గోల్డ్ మార్కెట్ వద్ద, అలాగే అక్షర స్కూల్‌లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొట్టగుల్లి సింహాచలంనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవి క్లబ్ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, ఎస్ సోమరాజు పాల్గొన్నారు.

పాడేరు : కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రిల జయంతిని పురస్కరించుకొని వారి విగ్రహాలకు జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, డిఆర్ఒ పి.అంబేద్కర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు:- ఐటిడిఎ కార్యాలయంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మహాత్ముడి నీతి సూత్రాలు, సిద్ధాంతాలు ఆదర్శనీయం, ఆచరణీయమన్నారు. ఐటిడిఎ ఎపిఒ ఎం.వేంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమ లత, ఐటిడిఎ పిహెచ్ఒ ఎన్.అశోక్, పరిశ్రమల శాఖ ఎడి నవీన్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: కండ్రుమ్ పంచాయతీలో సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు, స్థానికసర్పంచ్ కె.హరి, పోతంగి పంచాయతీలో సర్పంచ్ వి వెంకటరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి ఎంపిపి అరిసెల సీతమ్మ ఆధ్వర్యంలో జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర, విగ్రహదాత ఎస్‌కె.రెహమాన్ (చంటి) పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పాటబోయి సత్యనారాయణ, ఎస్.భాగ్యవతి, సర్పంచ్ ఎస్.సుభాష్‌చంద్ర, ఎంఇఒ కె.కృష్ణమూర్తి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కె.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో గాంధీ విగ్రహానికి జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, ఎంపిపి కూడా రాజుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఒ ఆర్ వెంకటరావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు ఒంటబు శామ్యూల్, సర్పంచ్ సమిడే వెంకటపూర్ణిమ, ఇసి. వెంకటేశ్వర్లు, ఇఒపిఆర్‌డి అశోక్, ఎంపిటిసిలు పరశురాం, తుమనాథ్ పాల్గొన్నారు.

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపిపి శెట్టి నీలవేణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎవివి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్. శ్రీనివాసరావు, ఎడిఎంహెచ్ఒ జి.ప్రకాశం, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ జి. డేవిడ్‌రాజ్, డిఇఇ చైతన్య, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఎపిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ అహింస, శాంతియుత మార్గంలో స్వాతంత్ర్య సాధనకు బాపూజీ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ రమణ. సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు. ఆర్. వెంకటేశ్వరరావు. రాజారెడ్డి, పల్లాల లక్ష్మిరెడ్డి, చెదల సోమిరెడ్డి, కత్తుల సోమిరెడ్డి, హెల్త్ మానిటరింగ్ సెల్ అధికారి ఝాన్సీ. పాల్గొన్నారు.

చింతూరు.: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి పురస్కరించుకుని మహాత్ముని విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం నివాళులర్పించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పద్మ, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్.అప్పనమ్మ, చరిత్ర విభాగాధిపతి పిఏడుకొండలు మాట్లాడుతూ, అహింస, సత్యాగ్రహం మార్గంలో స్వాతంత్ర్యసాధనకు కృషిచేసిన గాంధీజీ, భారతీయ సమాజంలో అసమానతలు, సామాజిక రుగ్మతలపై అహింసా మార్గంలో పోరాడారన్నారు. కె. శకుంతల, కె. శైలజ, కె. శ్రీదేవి, కె. శ్రీలక్ష్మి, ఆర్. మౌనిక, పి. గౌతమి, జి. సాయికుమార్ పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మహాత్ముని విగ్రహానికి ఎపి జెన్‌కో ఎస్ఇ(సివిల్) కెకెవి ప్రశాంత్ కుమార్, సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డిఎస్‌పి సురేష్, సర్పంచ్ దుర్గ, ఎంపిటిసి పిల్లా .సాంబమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సాధనకు గాంధీజీ కృషిని కొనియాడారు. మహాత్ముని ఆశయసాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

విఆర్.పురం: గాంధీజయంతిని పురస్కరించుకుని బాపూజీ చిత్రపటానికి జెడ్‌పిటిసి వల్ల రంగారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా నరేష్, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్య ప్రకాశరావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ కార్యదర్శి అచ్చిరాజ్, సీనియర్ నాయకులు ముత్యాల రమేష్, పాయం రామారావు, హరిబాబు, శివ పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం, మోతుగూడెం డిఎవి పాఠశాలలో గాంధీ విగ్రహానికి ప్రిన్సిపల్ రఘురాం, ఇతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముని స్మరించుకుంటూ విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గేయాలు అలరించాయి.

కొయ్యూరు : మండలకేంద్రంలో గాంధీజీ విగ్రహానికి జనసేన నేత సాగిన బుజ్జిబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బాబుతో నేను కార్యక్రమంలో టిడిపి నేతలు చేపడుతున్న రిలేదీక్షలకు జనసేన తరపున సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. టిడిపి, జనసేన నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మినుముల శ్రీనివాస్ పాత్రుడు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళు లర్పించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమణ, అధ్యాపకులు జగదీష్, ఈశ్వర్, సతీష్, రవీంద్ర, పూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మహాత్మునికి మొర

పాడేరు : సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని ఎపి సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా నాయకులు జై రాజు, చిన్నతల్లి మాట్లాడుతూ జిల్లాలో సమగ్ర శిక్షలో 856 మంది పలు విభాగాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, కస్తూర్బా పాఠశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులుగా ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయడంతోపాటు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం, సమానపనికి సరివేతనం, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయి చెల్లింపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ముంచింగిపుట్టు: గాంధీజయంతిని పురస్కరించుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి సిఆర్‌పిలు, సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నినాదాలు చేస్తూ మొరపెట్టుకున్నారు. అనంతరం జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్రకు వినతిపత్రం అందజేశారు. తమను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు, మూడు నెలల వేతన బకాయి చెల్లింపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మండి అనిల్‌కుమార్, మండల అధ్యక్షులు సొలగం గౌరీశంకర్, జనరల్ సెక్రటరీ కిల్లో ప్రసాద్,కోశాధికారి పాంగి సూర్యనారాయణ, సభ్యులు గడుతుల ఈశ్వరరావు, కిముడు హరి, పిఇటి శకుంతల, కాంతమ్మ, కామేష్ పాల్గొన్నారు.


రంపచోడవరంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎపిఒ


పాడేరు ఐటిడిఎలో గాంధీ జయంతి వేడుకలు


సీలేరులో గాంధీ విగ్రహానికి సిఆర్‌పిఎఫ్ డిఎస్‌పి నివాళు


మోతుగూడెం డిఎవి పాఠశాలలో గాంధీ జయంతి


చింతూరు డిగ్రీ కాలేజీలో గాంధీకి ఘననివాళులు

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..

- ఏళ్లుగడుస్తున్నా వినియోగంలోకి రాని జీనబాడు బాలికల ఆశ్రమ హాస్టల్ అదనపు భవనం
- అవస్థలు పడుతున్న విద్యార్థినులు
- కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- అధికారుల నిర్లక్ష్యంపై గిరిజనం మండిపాటు


కొత్త భవనం ముందు ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి -అనంతగిరి : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అదనపు వసతి కల్పించాలనే లక్ష్యంతో కోట్లాది రుపాయలతో హాస్టల్ భవనం పూర్తి చేసి ఏళ్ల గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని దుస్థితి. ఒకవైపు విద్యారినులు అరకొర వసతితో అవస్థలు పడుతుంటే, మరోవైపు నిర్మాణం పూర్తయిన భవనం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటోంది. అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల చొరవ లేమికి నిలువెత్తు నిదర్శనంగా అనంతగిరి మండలంలోని జీనబాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమఉన్నత పాఠశాల అదనపు హాస్టల్ భవనం నిలుస్తోంది. వివరాలివి.

మండలంలోని జీనబాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమఉన్నత పాఠశాల విద్యార్థినులకు అదనపు వసతి కల్పనకు రూ.1.942కోట్ల ఆర్ఎంఎస్ఎ నిధులను 2019-20లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చకచకా నిర్మాణ పనులు చేపట్టి, అప్పట్లోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే విద్యుదీకరణ పనులు చేపట్టకపోవడంతో అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేదు. ఆతర్వాత పట్టించుకునే నాథులే లేకపోవడంతో దాదాపు ఐదేళ్ల గడుస్తున్నా ఇది ప్రారంభానికి నోచుకోక, వినియోగంలోకి రాని పరిస్థితి ఉంది.

ఒకవైపు విద్యార్థినులు చాలీచాలని వసతితో అవస్థలు పడుతుంటే, మరోవైపు నిర్మాణం పూర్తయిన పక్కా భవనాలను వినియోగంలోకి తేవడంతో అధికారుల నిర్లక్ష్యం, నేతల నిర్వాకంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు ఐదేళ్లగా దాదాపు రెండు కోట్లతో నిర్మించిన ఈ భవనాన్ని పట్టించుకోకపోవడంతో చుట్టూ పిచ్చిమొక్కలు పేరుకుపోయి, శిథిల భవనంగా సాక్షాత్కరిస్తోంది. మరోవైపు భవనం గోడలు చెదలు పట్టి, బీటలు వారిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, జీనబాడు బాలికల హాస్టల్ అదనపు భవనానికి విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని, తద్వారా బాలికల వసతి కష్టాలకు మోక్షం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నాణ్యతకు చెల్లుచీటి!

- నిర్మాణ దశలోనే కూలుతున్న ఎంపిఎఫ్‌సిలు
- నాసిరకపు పనులే కారణమని ఆరోపణలు
- అధికారుల పర్యవేక్షణా లోపం..
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు
- ఆందోళనకు సిద్ధమౌతున్న గిరిరైతులు


తుమ్మలలో నిర్మాణంలో ఉన్న ఎంపిఎఫ్‌సి గొడౌన్


నాసిరకపు పనులతో నేలకూలిన బీమ్

ప్రజాశక్తి - చింతూరు : గిరిజన రైతుల పంట ఉత్పత్తుల నిల్వ కోసం ఏర్పాటుచేస్తున్న మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు (ఎంపిఎఫ్‌సి) నిర్మాణ దశలోనే కూలిపోతుండడంతో స్థానికులు ఆవేదన, ఆందోళన చెందు తున్నారు. అధికారుల పర్యవేక్షణాలోపం, నాసిరకపు పనులు వల్ల ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతుండగా, మరోవైపు కట్టడాలు నేల కూలుతున్నాయి. మన్యవాసుల పంటలను నిల్వ ఉంచడం కోసం శాశ్వతంగా పదికాలాల పాటు ఉండాలని ఏర్పాటుచేస్తున్న ఎంపిఎఫ్ సిలు ఇలా అర్థాంతరంగా కూలుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

చింతూరు డివిజన్‌లో రైతుల పంట నిల్వ కోసం సౌకర్యార్థం 13 మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మంజూరయ్యాయి. లోపాక పంచాయతీ పరిధిలో ఒక సెంటరు రవాణా సౌకర్యం సరిగా లేక నిర్మాణ సామగ్రిని తరలించే వీలు లేకపోవడంతో మధ్యలోనేపనులు ఆగిపోయాయి. మిగతా సెంటర్లు నిర్మాణాలు నాసిరకంగా, నత్తనడకన సాగుతున్నా పట్టించుకునే దిక్కులేదు. వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న భవనం నిర్మాణానికి రూ.70 లక్షలు, 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం వున్న సెంటర్ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరుచేసి పనులు చేపడుతున్నారు.

తుమ్మల గ్రామ పంచాయతీలో వెయ్యి మెట్రిక్‌టన్నుల సామర్థ్యం వున్న సెంటర్ నిర్మాణ దశలోనే ప్రధాన ద్వారం ఏర్పాటు చేసే క్రమంలో బీమ్ కూలి పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపిటిసి వేక రాజకుమార్, తుమ్మల గ్రామస్తులు సెంటర్‌ను సందర్శించి, పరిశీలించారు. నాసిరకపు నిర్మాణ పనుల వల్లే బీమ్ కూలిపోయిందని ఆరోపించారు. సిమెంట్ తక్కువగా వేస్తూ కాంక్రీటు పనులు చేస్తున్నారని, ఇంకా గోడల నిర్మాణంలోనూ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. నిర్మాణంలో ఉండగానే గోడలు మధ్య అప్పుడే గ్యాపులు వచ్చేశాయని, గోదాము పైభాగాన వేసిన షీట్‌కాన్ టెంబుల్ సరిగా లేదని, పైకప్పు షీట్లు కూడా నాసిరకంగానే ఉన్నాయని, అంతేకాక పని ప్రదేశంలో పర్యవేక్షణకు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులుగానీ, సిబ్బందిగానీ కనీసం లేకపోవడం వల్ల కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేయడం వల్లే ఇటువంటి పరిస్థితి తలెత్తిందని అంటున్నారు. రైతుల పంట ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు నిర్మిస్తున్న ఈ గొడౌన్‌లు నిర్మాణ దశలోనే కూలిపోతుంటే, అవి ఎంతకాలం ఉంటాయో స్పష్టమౌతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణతో ఎంపిఎఫ్‌సిల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని, లేకుంటే ఆందోళన తప్పదని ఎంపిటిసితోపాటు స్థానిక రైతులు, ప్రజలు హెచ్చరిస్తున్నారు.పిడుగురాళ్లపల్లి పంచాయతీ లోని వెయ్యి మెట్రిక్ సామర్థ్యం వున్న గొడౌన్, అలాగే ఎజి,కోడేరులో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గొడౌన్ల నిర్మాణం ఇంకా పునాదుల దశను దాటలేదని అంటున్నారు. చింతూరు డివిజన్‌లో కోట్లాది రుపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న ఈ గోదాములు నిర్మాణంపై ఇప్పటికైనా తగుచ ర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.దీనిపై వివరణ కోసం సంబంధిత అధికారుల వివరణ కోసం పలుమార్లు ఫోనులో సంప్రదించే ప్రయత్నం చేసినా అందుబాటులో లేరు. కాగా ఎంపిఎఫ్‌సి గొడౌన్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, సకాలంలో పనులు పూర్తిచేయకుంటే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.


గొడౌన్ గోడల మధ్య భారీగా కనిపిస్తున్న గ్యాప్‌లు


కూలిన బీమ్‌ను పరిశీలిస్తున్న ఎంపిటిసి, గ్రామస్తులు

ఘనంగా ధాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం


బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, అతిథులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్థానిక షాదిఖానాలో ధాన్ ఫౌండేషన్ 27వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఉత్సాహపూరితంగా నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా సిఎంఎఫ్ఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ ఎం జోష్ పాల్గొని, మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున ఆవిర్భవించిన ధాన్ ఫౌండేషన్, బాపూజీ ఆశయాలతో నడుస్తూ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ధాన్ ఫౌండేషన్ లక్ష్యాలలో, అభివృద్ధిలో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ధాన్ ఫౌండేషన్ రీజనల్ కోఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ, గాంధీ ఆశయాలతో మనం పేదరిక నిర్మూలనకు 26ఏళ్లగా పనిచేస్తున్న ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2300 గ్రూపులు 33 వేల కుటుంబాలు ఉన్నాయన్నారు. పొదుపు, రుణాలు మాత్రమే కాకుండా, జీవనోపాధి, ఆరోగ్య, విద్యా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందరి సమిష్టి కృషితో 26ఏళ్లలో 5530మందిని, ఈ ఏడాది 1500 మందిని పేదరికం నుంచి బయటపడ్డారన్నారు. ఈ సందర్భంగా పేదరికం నుంచి బయటపడిన వారి వివరాలతో క్యూర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'వాటర్ వాచ్' బుక్‌లెట్ విడుదల చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగరాజు, మత్స్యశాఖ జెడి విజయ, ఎడి కిరణ్‌కుమార్, జన శిక్షణ సంస్థాన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జెఎంఆర్ వరలక్ష్మి సంస్థ సాయికిషోర్, జెసిఐరాధిక, హెన్న, ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రత్యామ్నాయమే కాదు!

- డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు

ప్రజాశక్తి- కలెక్టరేట్: పాత పెన్షన్ విధానానికి జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి జి.మధు అన్నారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జిపిఎస్‌ను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపక్ష నేతగా వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని వాగ్దానం చేసిన సిఎం జగన్, అధికారంలోకి వచ్చాక హామీలకు తిలోదకాలిస్తే విశ్వసనీయత ఎక్కడని ప్రశ్నించారు. పాత పింఛను విధానం అమలు కష్ట సాధ్యమన్న విద్యామంత్రి, జిపిఎస్‌పై సలహాలూ, ఫిర్యాదులు ఇస్తే పరిశీలిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న పాత పింఛను విధానం, ఏపీలో అమలు ఎందుకు సాధ్యం కాదో చెప్పాలని ప్రశ్నించారు. డిటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. ధర్మేందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసారు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబి) సిలబస్ అమలుకు కేబినెట్ లో ఆమోదం తెలపడం ఆశ్చర్యంగా ఉందన్నారు..అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కె.ఎస్.ఎస్.సాయిప్రసాద్, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, డిటిఎఫ్ నాయకులు సంధ్యారాణి,కె. నానాజీరావు,సిహెచ్ బుజ్జి,కొల్లి రాజు,రామ తులసి,ఉషారాణి, సంతోషి,మల్లారెడ్డి శంకర ప్రసాద్,కరుణకుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఆరోగ్యశాఖ మంత్రి అరకు పర్యటన

- ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రారంభించనున్న రజని

ప్రజాశక్తి పాడేరు:-ఈ నెల3,4, తేదీల్లో మంగళ, బుధవారాల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి విడదల రజని అనంతగిరి, అరకులోయ మండలాల్లో పర్యటిస్తున్నారు. అరకులోయ ప్రాంతంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.3న మధ్యాహ్నం అనంతగిరి హరిత వ్యాలీ రిసార్ట్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి సాయంత్రం 6.30 గంటలకు అరకు లోయలో రైల్వే గెస్ట్ హౌస్‌కు చేరుకొనిఅక్కడే రాత్రి బస చేస్తారు. 4న ఉదయం 10:30 గంటలకు అరకులోయ మండలంలోని కిల్లోగుడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. అనంతరం 11: 45 గంటలకు గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొంటారు. వైద్యసేవలను పర్యవేక్షిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటలకు బయలుదేరి, 3:45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు.

ఏక మత ఆధిపత్యానికి బిజెపి కుట్ర

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి- కలెక్టరేట్: దేశంలో ఏక మత ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ శాంతియుత పోరాట స్ఫూర్తితో మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. నీతి నిజాయితీలకు మారుపేరైన లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి కూడా నేడేనని, ఆయన విధానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జివిఎంసి ఫ్లోర్‌లీడర్, ఎజె స్టాలిన్, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె. సత్యాంజనేయ, జి.ఎస్.జె అచ్యుతరావు, ఎస్‌కె రెహమాన్, జి.రాంబాబు, పి.చంద్రశేఖర్, సిఎన్ క్షేత్రపాల్, ఎండి బేగం, ఎ. దేముడమ్మ పాల్గొన్నారు.